రహదారిపై గుంతలు.. తరచూ ప్రమాదాలు



తిప్పర్తి-నకిరేకల్ రహదారిపై ఏర్పడిన లోతైన గుంత

తిప్పర్తి, న్యూస్‌టుడే: తిప్పర్తి-నకిరేకల్ ఆర్అండ్‌బీ రహదారి ప్రమాదకరంగా మారింది. తిప్పర్తి నుంచి నకిరేకల్ పట్టణానికి 18 కిలోమీటర్లు వరకు ఈ రహదారి ఉంటుంది. ఈ రోడ్డును 2017లో రూ.16 కోట్లతో రెండు వరసల రహదారిగా విస్తరించారు. సదరు గుత్తేదారు పనులు 2018లో పూర్తిచేశారు. రెండేళ్ల పాటు రహదారి నిర్వహణ పనుల పర్యవేక్షణను గుత్తేదారు చేపట్టారు. అనంతరం వర్షాలకు రహదారి దెబ్బతింది. ప్రస్తుతం తిప్పర్తి నుంచి నకిరేకల్ వరకు పలుచోట్ల రహదారిపై లోతైన గుంతలు పడ్డాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక గుంతను తప్పిస్తే మరో గుంతలో వాహనం పడుతోంది. ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తమ ద్విచక్ర వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు తెలిపారు. రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు పెరిగి రోడ్డు కనిపించకుండా కమ్మేశాయి. రెండు వాహనాలు ఎదురైన సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చడంతోపాటు ముళ్లపొదలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. మరమ్మతుల కోసం టెండర్ పిలిచామని.. ఈ ప్రక్రియ పూర్తవగానే త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆర్ అండ్ బీ ఏఈ గౌస్ తెలిపారు.

నల్గొండకు మహర్దశ

- రూ.516 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం అనుమతి
- తప్పనున్న ట్రాఫిక్ ఇక్కట్లు



బైపాస్‌గా విస్తరించనున్న హౌసింగ్‌బోర్డుకాలనీ రోడ్డు

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:


నల్గొండ, సూర్యాపేట జిల్లాల ప్రజలు, వ్యాపారుల కల నెరవేరనుంది. జాతీయ రహదారి-565లో నకిరేకల్-నాగార్జున సాగర్ మార్గంలో నల్గొండ పట్టణం వద్ద బైపాస్ రోడ్డు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మహారాష్ట్రలోని సిరోంచ నుంచి మొదలు వయా నకిరేకల్, నల్గొండ, నాగార్జునసాగర్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల, ఎర్రగొండపాలెం, కనిగిరి, చిత్తూరు వరకు జాతీయ రహదారి నెంబరు 565 నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మూడు రాష్ట్రాలను అనుసంధానిస్తూ నిర్మిస్తున్న ఈ జాతీయ రహదారిలో నల్గొండ పానగల్ కూడలి నుంచి 14 కి.మీ మేర నాలుగు వరసల బైపాస్ రహదారి నిర్మాణానికి రూ.516 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు సోమవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదిక ద్వారా ప్రకటించారు. బైపాస్ నిర్మాణంతో వాహనదారులకు మరింత రవాణా సౌకర్యం మెరుగు పడనుంది.

మారనున్న రూపురేఖలు

ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల అనుసంధానానికి జాతీయ రహదారి-565 కీలకమైనది. ఈ దారిలో నాలుగు వరసల బైపాస్ నిర్మాణంతో నల్గొండ రూపురేఖలు మారనున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే పట్టణంలో వాహనాల రద్దీ తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్య తీరనుంది. నల్గొండ, చండూరు, మునుగోడు, కనగల్, గుర్రంపోడు, కొండమల్లేపల్లి, మాల్, సంస్థాన్ నారాయణపురం మండలాలకు రవాణా సౌకర్యం మరింత సులువుకానుంది. నకిరేకల్-నాగార్జున సాగర్ దారిలో సురక్షితమైన ప్రయాణానికి దోహదం చేస్తుంది. నల్గొండ పురపాలిక పరిధిలో వెనుకబడిన ప్రాంతాలైన పాతబస్తీ, మామిళ్లగూడ, మర్రిగూడ, పానగల్, కతాలగూడ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

నాలుగు వరసల రోడ్డుకు ప్రతిపాదన ఇలా..

నకిరేకల్-మాచర్ల సెక్షన్ పరిధిలో నల్గొండ పట్టణంలో గత పదేళ్లుగా జాతీయ రహదారి విస్తరణ పనులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వానికి వ్యాపారులు మొర పెట్టుకున్నా ఆలకించే వారు కరవయ్యారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రూ.700 కోట్ల ప్రతిపాదనలతో బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరిన విషయం విదితమే. మంత్రి అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఫిబ్రవరిలో పచ్చజెండా ఊపింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బైపాస్ నిర్మాణానికి మూడు మార్గాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనల పంపించారు. అందులో పానగల్ ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం నుంచి వయా పానగల్, మర్రిగూడ మీదుగా హౌసింగ్‌బోర్డుకాలనీ, సంతోష్‌నగర్, కతాలగూడ, గంధవారిగూడెం, ఎస్ఎల్‌బీసీ మెడికల్ కళాశాల వరకు 14 కి.మీ. మేర నాలుగు వరసల బైపాస్ రోడ్డు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. రోడ్డు అలైన్‌మెంటు విడుదల కావడంతో నిర్మాణ పనులకు అవసరమైన కసరత్తు ప్రభుత్వ యంత్రాంగం చేపట్టింది. భూసేకరణకు అవసరమైన సర్వే ఇప్పటికే ప్రారంభమైంది. రెవెన్యూ అధికారులు ఎనిమిది కి.మీ మేర సర్వే పూర్తి చేశారు.



ప్రతిపాదిత రోడ్డు

రైతులకు మేలు చేసేందుకే కొనుగోలు కేంద్రాలు: కలెక్టర్



తిప్పర్తిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, తదితరులు

తిప్పర్తి, న్యూస్‌టుడే: రైతులకు మేలు చేసేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని, జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. తిప్పర్తిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సన్న, దొడ్డు రకాల ధాన్యాన్ని వేరువేరుగా కొనుగోలు చేయాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రైతులు కూడా 17 తేమ శాతం వచ్చేలా ఆరబెట్టుకొని తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం జనవరి 1 నుంచి చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు ఇదివరకే ప్రకటించిందని తెలిపారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ధాన్యాన్ని తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లారీలు, హమాలీలు, గన్నిబ్యాగులు, టార్పాలిన్లు తూకం వేసే యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, మార్కెట్‌కమిటీ ఛైర్మన్ జూకూరి రమేశ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పాశం రాంరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు సేవలందించాలి: ఎస్పీ



దస్త్రాలు తనిఖీ చేస్తున్న ఎస్పీ

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: నిరంతరం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలందించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. నార్కట్‌పల్లిలోని పోలీస్ ఠాణాను తనిఖీ చేసి మంగళవారం మాట్లాడారు. ఠాణాకు వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే న్యాయం చేయడంతో పాటు ప్రతి ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో నిఘా నేత్రాలు ఏర్పాటు చేయడంలో ప్రజల్లో చైతన్యం కల్పించాలని చెప్పారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు హైవే వెంట ప్రమాదాలు నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని తెలియజేశారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేస్తూ దొంగతనాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, అక్రమ ఇసుక, రేషన్ బియ్యం రవాణాపై ప్రత్యేక దృష్టి ఉంచి చర్యలు తీసుకోవాలని అన్నారు. డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ నాగరాజు, ఎస్సై క్రాంతికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి పర్యటన

నల్గొండ సంక్షేమం: నల్గొండ సమీపంలోని ఎస్ఎల్‌బీసీ కాలనీ ప్రాంతంలో ఉన్న బత్తాయి మార్కెట్‌లో బుధవారం ఉదయం 9.30 గంటలకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రకటనలో తెలిపారు. మంత్రులు హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 9గంటలకు నల్గొండలోని కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారని పేర్కొన్నారు. నల్గొండలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన అనంతరం నిడమనూరులో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరవుతారని తెలిపారు. అనంతరం పెద్ద గూడెం స్టేజి వద్ద నిడమనూరు -మిర్యాలగూడ వయా అన్నారం రోడ్డుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. నిడమనూరు మండలం ముసలమ్మ చెట్టు స్టేజీ పనులకు శంకుస్థాపన .. ఆ తరువాత హాలియాలో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరై సాయంత్రం 5గంటలకు హైదరాబాద్‌కు బయలు దేరుతారని కలెక్టర్ వెల్లడించారు.

నల్గొండలో 20 నుంచి రాష్ట్రస్థాయి చేనేత ప్రదర్శన

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: ఈ నెల 20 నుంచి నవంబరు 2వ తేదీ వరకు నల్గొండలోని తితిదే కల్యాణమండపంలో రాష్ట్రస్థాయి చేనేత ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు ద్వారక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 50 నుంచి 60 చేనేత సహకార సంఘాలు వివిధ రకాల ఉత్పత్తులతో ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రమ్మని.. రద్దని.. మళ్లీ రావాలని

- ఉరుకులు పరుగులు పెట్టించిన విద్యాశాఖ
- అర్ధరాత్రి వరకు కొనసాగిన కౌన్సెలింగ్



నల్గొండలోని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రాంగణంలో కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: వేలాది మంది అభ్యర్థులతో పోటీపడి కష్టపడి చదివి డీఎస్సీ-2024 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలల కేటాయింపు ప్రక్రియ నిర్వహణ కొంత ఆవేదనకు గురిచేసింది. కొత్తగా సర్కారు ఉద్యోగం వచ్చిందన్న సంతోషం ఉన్నా కౌన్సెలింగ్‌కు పిలిచి.. తీరా వచ్చాక రద్దయ్యిందని చెప్పడం... తిరిగి అక్కడి నుంచి వెనుదిరిగి స్వగ్రామాలకు వెళ్లాక మళ్లీ ఫోన్లు చేసి కౌన్సెలింగ్‌కు రావాలని చెప్పారు. దీంతో ఆగమేఘాల మీద మధ్యాహ్నం తరువాత కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. అభ్యర్థులను ఉరుకులు పరుగులు పెట్టించారు విద్యాశాఖ అధికారులు. కౌన్సెలింగ్‌కు హాజరై ఆర్డర్ పొందాక కాస్త సంతోషం అనిపించినా విద్యాశాఖ కౌన్సెలింగ్ నిర్వహణ తీరును, అర్ధరాత్రి వరకు నిర్వహించడంపై అభ్యర్థులను కొంత ఆవేదనకు గురిచేసింది.

ఫోన్ల మీద.. ఫోన్లు..

డీఎస్సీ-2024లో నియామక ఆర్డర్లు పొందిన అభ్యర్థులంతా మంగళవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. అభ్యర్థులకు ఒక రోజు ముందే ఆ శాఖ సిబ్బంది ఫోన్లు చేసి ప్రభుత్వ డైట్ కళాశాలకు రావాలని చెప్పారు. ఉదయం 10 గంటలకు అక్కడకు చేరుకున్న వారికి కౌన్సెలింగ్ రద్దయ్యిందని అధికారులు చెప్పారు. అధికారికంగా ప్రకటించడంతో చాలా మంది వెనుదిరిగి గ్రామాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. తీరా మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ఫోన్లు చేసి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అప్పటికే దూర ప్రాంతాలకు వెళ్లిన వారంతా వ్యయ ప్రయాసలతో ఉరుకుల పరుగులతో తిరిగి ప్రభుత్వ డైట్ కళాశాల కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 3.30 ప్రాంతంలో అభ్యర్థులకు పాఠశాలల కేటాయింపు ప్రక్రియ ప్రారంభించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఈవో బి.భిక్షపతి ఆధ్వర్యంలో జిల్లాలో మొత్తం 535 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్జీటీ (తెలుగు) 366 పోస్టులు, ఎస్జీటీ (ఉర్దూ) 4, ఎల్‌పీ(హిందీ) 10, ఎల్‌పీ(తెలుగు) 12, ఎల్‌పీ(ఉర్దూ) 1, పీఈటీ(తెలుగు) 3, పీఈటీ(ఉర్దూ) 3, ఎస్ఏ(ఆంగ్లం) 20, ఎస్ఏ(హిందీ) 7, ఎస్ఏ(తెలుగు) 17, ఎస్ఏ(ఉర్దూ) 1, ఎస్ఏ(గణితం) తెలుగు 12, ఎస్ఏ(ఫిజిక్స్) తెలుగు 2, ఎస్ఏ(బయాలజీ) తెలుగు 24, ఎస్ఏ(బయాలజీ)ఉర్దూ 1, ఎస్ఏ(సోషల్)తెలుగు 37, ఎస్ఏ(ఫిజికల్ ఎడ్యుకేషన్) 3, ఎస్ఏ(స్పెషల్ ఎడ్యుకేషన్) 12 పోస్టులకు కౌన్సెలింగ్ జరిపారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి రాత్రి 8.30 వరకు కౌన్సెలింగ్ పూర్తి చేశారు. రాత్రి 8.45 ప్రాంతంలో ఎస్జీటీ మండల పరిషత్ పాఠశాలలకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. 342 మందికి పైగా ఉండటంతో అర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్ కొనసాగింది. తర్వాత పాఠశాలలు కేటాయించిన వారికి ఉత్తర్వులు ఇస్తున్నారు.



అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర నుంచి పోస్టింగ్ ఉత్తర్వు అందుకుంటున్న అభ్యర్థి

యాదాద్రిలో సంప్రదాయ ఆరాధనలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రిలో మంగళవారం పంచ నారసింహులకు నిత్య ఆరాధనలతో పాటు క్షేత్ర పాలకుడైన ఆంజనేయ స్వామిని కొలిచే ప్రత్యేక పూజలు ఆలయ ఆచారంగా కొనసాగాయి. గర్భాలయంలోని మూలవరులకు గోవుపాలతో నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఆకు పూజ చేపట్టారు. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వయం భువులను హారతితో కొలిచారు. దర్శన మూర్తులను బంగారు పుష్పాలతో ఆరాధించారు. ఆలయ మండపంలో స్వర్ణ పుష్పార్చన, అష్టభుజి మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణం నిర్వహించారు. మంగళవారం వివిధ విభాగాల ఆలయ ఖజానాకు రూ.21,99,248 చేకూరింది.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు కమిటీలు

- పంచాయతీలు, పురపాలికల్లో నియామకానికి కసరత్తు

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే:

నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 3500 గృహాలు కేటాయించనుంది. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ.5 లక్షలు చెల్లిస్తారు. దీని కోసం ప్రత్యేకంగా గ్రామాలు, పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలోని సభ్యులు, అధికారులు సంయుక్తంగా లబ్ధిదారులను గుర్తిస్తారు. ఇందిరమ్మ కమిటీల నియామకానికి అధికారులు గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహిస్తున్నారు.

వీరికి స్థానం

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 12 నియోజకవర్గాలు, 1784 గ్రామ పంచాయతీలున్నాయి. తొలి విడతలో భాగంగా జిల్లాకు 42 వేల ఇళ్లు మంజూరు చేస్తారు. గ్రామ పంచాయతీలు, పురపాలికల్లో వార్డు కమిటీల నియామకానికి అధికారులు కార్యాచరణ చేపట్టారు.

★ గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచుల స్థానంలో ప్రత్యేకాధికారికి ఇందిరమ్మ కమిటీల్లో చోటు కల్పించారు. ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున, పంచాయతీ కార్యదర్శి గ్రామ కమిటీల్లో భాగస్వాములవుతారు.

★ పురపాలక సంఘాల పరిధిలో వార్డు కౌన్సిలర్, ఇద్దరు మహిళా పొదుపు సంఘాల సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున సభ్యులుగా ఉంటారు. ఎవరైనా అనర్హులు ఎంపికై బిల్లులు తీసుకుంటే వారిపై ఫిర్యాదు చేసి నిధులు రాబట్టే అధికారం వీరికి ఉంటుంది.



కమిటీల్లో సభ్యులు

ఉమ్మడి జిల్లాలో గ్రామ పంచాయతీలు: 1784	ఒక్కో గ్రామ కమిటీలో సభ్యులు: ఏడుగురు
మొత్తం సభ్యులు: 12,488 మంది	పురపాలికలు: 17
365 వార్డుల్లో కమిటీ సభ్యులు: 2,555 మంది	

నిబంధనలు ఇలా..

- కమిటీ సభ్యులు పేద, మధ్య తరగతి వారై ఉండాలి.
- జాతీయ ఆహార భద్రత కార్డు తప్పనిసరి.
- అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యం
- ఒంటరి మహిళలు, వితంతువులకు అవకాశం.
- సొంత ఇంటి జాగా కలిగి ఉండాలి.

ఇంతింతై.. ఎదిగారిలా..!

★ న్యాయవాద వృత్తిలో రాణిస్తున్న మహిళలు



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా బార్ అసోసియేషన్ హాల్

ఇతర వృత్తులతో పోల్చితే న్యాయవాద వృత్తి సవాళ్లతో కూడుకుంది. దశాబ్దాలుగా క్రితం న్యాయవాద వృత్తిలోకి వచ్చే మహిళలు చాలా తక్కువగా ఉండేవారు. ఇంజినీరింగ్, ఫార్మసీ రంగాలతో పాటు ప్రస్తుతం న్యాయ విద్యపై యువతులు, మహిళలు ఆసక్తి చూపుతున్నారు. జిల్లా నుంచి న్యాయవాద విద్యను అభ్యసించే వారి సంఖ్య పెరుగుతోంది. ఇంటర్మీడియట్ అయిపోయిన తర్వాత ఐదేళ్ల లాకోర్సు, గ్రాడ్యుయేషన్ అయిపోయినవారు మూడేళ్ల లా కోర్సు చేసి న్యాయవాద వృత్తిలోకి అడుగు పెడుతున్నారు. గతంలో ఆరుగురు న్యాయవాదులు మాత్రమే ఉన్న జిల్లా కోర్టులో ప్రస్తుతం 25 మహిళా న్యాయవాదులు ఉన్నారు. గత నాలుగేళ్ల కాలంలో 15 మందికిపైగా ఈ వృత్తిలోకి వచ్చారంటే ఈ వృత్తిపై పెరుగుతున్న ఆసక్తి తెలుస్తోంది. జిల్లా కోర్టుతో పాటు రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్, యాదగిరిగుట్ట కోర్టులో 10 మంది వరకు ప్రాక్టీస్ చేస్తున్నారు. హక్కులను కాపాడుతూ సామాజిక ఇంజినీర్లుగా భరోసా ఇచ్చేందుకు ఈ వృత్తిలో వచ్చామని, సామాజిక సేవ దృక్పథంతో బాధ్యతలు నిర్వర్తిస్తామని అంటున్నారు ఈ న్యాయవాదులు.

'న్యాయవాదిగా 2001లో భువనగిరి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు ఇద్దరు మాత్రమే మహిళా న్యాయవాదులు ఉండేవారు. జిల్లా కోర్టులో ప్రస్తుతం న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న మహిళల సంఖ్య చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది.. ఇతర రంగాలతో సమానంగా న్యాయవాద వృత్తిలో మహిళలు ఎదగడం, మగువలకు ప్రత్యేక బార్ అసోసియేషన్ హాల్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం. ఈ వృత్తిలో రాణించేందుకు ఎప్పటికప్పుడు చట్టాలపై పట్టు సాధించి ఎదగాలి.' - భువనగిరి కోర్టులో మహిళా బార్ అసోసియేషన్ ప్రారంభం సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన అన్న మాటలివి.

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే:

అసమానతలు ప్రశ్నించేందుకే

– కె.జయ, ఉపాధ్యక్షురాలు, భువనగిరి బార్ అసోసియేషన్



చిన్నతనంలో వివాహమైనా కుటుంబాన్ని పోషిస్తూ గిండా. ఓ స్వచ్ఛంద సంస్థలో ఆర్గనైజర్‌గా పని చేస్తున్న సమయంలో మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచార ఘటనలు, ఎస్సీ, ఎస్టీలకు జరిగే సామాజిక అన్యాయం, అసమానతలు ప్రశ్నించేందుకు న్యాయశాస్త్ర విద్యనభ్యసించాను. 2009లో న్యాయవాద వృత్తిలో అడుగు పెట్టాను. మహిళలకు అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నాను.

నిరంతర కృషి ఉంటేనే

– చందుపట్ల రజని, న్యాయవాది

న్యాయవాద వృత్తిలో పురుషులతో సమానంగా మగువలు ముందుకు వస్తున్నారు. వృత్తిలో ప్రారంభంలో ఇబ్బందులు ఉన్నా రాణించేందుకు నిరంతరం కృషి ఉండాలి. మహిళలు ఇటువైపు వచ్చేలా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలి. 2005లో న్యాయవాద వృత్తిలోకి వచ్చాను. ఇతర రంగాలతోపాటు గౌరవ ప్రదమైన న్యాయవాద వృత్తిలో వచ్చేవారి సంఖ్య పెరిగింది. చాలా మంది స్త్రీలు తమ హక్కులను తెలుసుకోలేకపోతున్నారు. అలాంటి వారికి అండగా ఉంటాం.

సామాజిక సేవే దృక్పథంగా:

– విజయమమత, సఖి కేంద్రం లీగల్ కౌన్సెలర్



వివాహమైన తర్వాత పట్టుదలతో ఎల్ఎల్‌బీ పూర్తి చేశాను. 2022లో న్యాయవాదిగా సామాజిక సేవా దృక్పథంతో భువనగిరి సఖి కేంద్రం లీగల్ కౌన్సెలర్‌గా చేరాను. సఖీ కేంద్రంలో ఆశ్రయం పొందిన వేధింపులు, అత్యాచార బాధితులు, వరకట్న బాధితుల కేసులను వాదిస్తున్నాను. వారితో మమేకమై సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాను.

మామయ్య ప్రోత్సాహంతో

– చేగూరి సరిత, జూనియర్ న్యాయవాది



ఇంజినీరింగ్ పూర్తి చేశాను. వివాహమైన తర్వాత మా మామయ్య నాగారం అంజయ్య ప్రోత్సాహంతో న్యాయవిద్యను పూర్తి చేశాను. గతేడాది నుంచి అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేసేందుకు వస్తున్నాను. అతివల హక్కులు కాపాడేందుకు, వృత్తిలో రాణించేందుకు కృషి చేస్తున్నాను.

వృథాను అరికడదాం.. అభాగ్యుల ఆకలి తీరుద్దాం

మిర్యాలగూడ పట్టణం,సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే:



దుక్కిదున్ని, నారుమడి సిద్ధం చేసి.. విత్తనాలు విత్తితే మొలకెత్తడానికి వారం రోజుల సమయం పడుతుంది. నారు ఎదిగేందుకు.. నాటుకు 25 రోజులు.. ఎరువులు చల్లి.. కలుపు తీసి.. సస్యరక్షణ చేపడితే కొద్ది రోజులకు సన్న వడ్లు చేతికి వస్తాయి.. ఇలా విత్తనం.. వరిగింజగా మారడానికి అన్నదాత 95 రోజులూ స్వేదం చిందించి శ్రమించాల్సిందే.

అన్నదాత అంత కష్టపడి.. వర్షాల నుంచి పంటను కాపాడి.. అన్నాన్ని చేతికిందిస్తే.. శుభకార్యాలు, హోటళ్లల్లో నిత్యం కిలోల కొద్దీ ఆహారాన్ని వృథాగా పడేస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాలైన నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, భువనగిరి వంటి పట్టణాల్లో అభాగ్యులు, పేదలు ఆహారం కోసం నిరంతరం అన్వేషిస్తూనే ఉన్నారు. ఇలాంటి వారి ఆకలిని తీర్చడానికి ఐక్యరాజ్యసమితి ఆహార భద్రత కోసం 1945 అక్టోబరు 16న 'ఆహార, వ్యవసాయ సంస్థ'ను ఏర్పాటు చేసింది. ఆ రోజు గుర్తుగా ఏటా మాదిరిగానే బుధవారం జరుపుకొనే 'ప్రపంచ ఆహారం దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

★ నేడు 'ప్రపంచ ఆహార దినోత్సవం'



స్వచ్ఛంద సంస్థల కృషి ఇలా..

ఆహార వృథాను అరికట్టేందుకు ఉమ్మడి జిల్లాలో పలు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు కృషి చేస్తున్నాయి. టీఎన్‌బీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో మిగిలిన ఆహార పదార్థాలను పెట్టేందుకు ఓ ఫ్రిజ్‌ను ఏర్పాటు చేశారు. నిర్వహణ సక్రమంగా లేక తొలగించారు. సూర్యాపేటలోనూ ఇదే పరిస్థితి.

★ మిర్యాలగూడకు చెందిన ఆకుల కృష్ణంరాజు, అవిరెండ్ల సందీప్ మిత్రబృందాలు, నల్గొండకు చెందిన అమ్మ ఫౌండేషన్ రేఖ, ఆపద్బాంధవ ఫౌండేషన్ సంజు, చౌటుప్పల్‌కు చెందిన ఆయాన్ భార్గవ్ ట్రస్టు మురళి, సూర్యాపేటకు చెందిన మదర్ థెరిసా ఫౌండేషన్ జానీపాషా తదితరులు ఆహార వృథాను అరికట్టేందుకు శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని సేకరించి పేదలకు పంచుతూ తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు.

- ☛ దేశంలో ఒక్కో వ్యక్తి సగటున ఏటా 55 కిలోల ఆహారాన్ని వృథాగా పడేస్తున్నారు.
- ☛ గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోనే ఆహార వృథా అధికం.
- ☛ దేశంలో సుమారు 14.3శాతం మంది తగిన పోషకాలు అందక బాధ పడుతున్నారు.
- ☛ ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలకు పోషకాహార లోపమే కారణమని ఐసీఎంఆర్ హెచ్చరించింది.

ఒక్క మెతుకునూ వదిలిపెట్టం

– ధనావత్ శివ, రైతు, మాటూరు, త్రిపురారం మండలం



గత 20 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. ఆరుగాలం శ్రమించి పంటను పండించడం ఎంతో కష్టమైన పని. మేము వ్యవసాయాన్ని దైవంగా భావిస్తూ.. పంటను ఎంతో ప్రేమిస్తాం. కష్టపడి పండించిన ఆహారాన్ని ఇటీవల అనేక మంది వృథా చేస్తుంటే ఎంతో బాధ కలుగుతుంది. మేము అన్నం తినేటప్పుడు కింద ఒక్క మెతుకు పడితే దాన్ని కూడా తీసుకుని కంచంలో వేసుకుంటాం. ఆహార వృథాను కాపాడేందుకు ప్రభుత్వాలు సైతం ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

ఏడేళ్లుగా అన్నదానాలు

–ధైద నాగరాజు, మనం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నార్కట్‌పల్లి

నిత్యం అనేక మంది ఆకలితో అలమటిస్తున్నారు. వారి ఆకలి తీర్చేందుకు గత ఏడేళ్లుగా నార్కట్‌పల్లి, పరిసర ప్రాంతాల్లో



అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆరు నెలల క్రితం 'మనం ఫౌండేషన్' పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించి నిత్యం వంద మందికి, సంత జరిగే శుక్రవారం 200 మందికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

కోదాడ, న్యూస్‌టుడే: అపసవ్య దిశలో వెళ్తున్న స్కూటీని డీసీఎం వాహనం ఢీకొనడంతో ఓ యువతి మృతి చెందిన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని నయానగర్‌కు చెందిన పలివెల నాగజ్యోతి(18) ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో ఇంటర్ చదువుతోంది. బంధువుల స్కూటీ తీసుకొని పట్టణంలోని హుజూర్‌నగర్ ఫైవంతెన మీది నుంచి అపసవ్య దిశలో విజయవాడ వైపునకు వెళ్తుంది. అదే క్రమంలో విజయవాడ వైపు నుంచి డీసీఎం వాహనం వచ్చి స్కూటీని ఢీకొంది. ఈ ఘటనలో నాగజ్యోతి తలకు తీవ్ర గాయాలై మరణించింది. తల్లి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపారు. యువతి ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోందని, దీంతో స్కూటీ మీద అపసవ్య దిశలో వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: పట్టణంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న సయ్యద్ లతీఫ్ ఉల్లా షా ఖాద్రి ఉర్సు ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సయ్యద్ లతీఫ్ ఉల్లా షా ఖాద్రి ఉర్సు ఉత్సవాలపై ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి మంగళవారం నల్గొండ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఉత్సవాలకు వచ్చే ప్రజలకు అవసరమైన తాగునీరు, శానిటేషన్ వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. 16న ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 17న గంధం ఊరేగింపు ఉంటుందని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఉత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ఆర్డీవోలు, డీఎస్పీలు ఉర్సు ఉత్సవాలు పర్యవేక్షించాలన్నారు. ఉర్సు ఉత్సవాలు జరిగే చోట తాగునీరు, శానిటేషన్‌ను నల్గొండ పుర కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి మిషన్ భగీరథ ఎస్ఈలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ మాట్లాడుతూ. . ఉర్సు ఉత్సవాలకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సంబంధిత అధికారులు అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి ఉత్సవాలను శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలు జరిగే చోట పార్కింగ్, క్యూలైన్‌ల ఏర్పాటు, బారికేడింగ్ వంటివి ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో బందోబస్తుకు గార్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ఆర్డీవో శ్రీదేవి, డీఎస్పీ శివరాంరెడ్డి, నల్గొండ పుర కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అధికారులు

ఆర్టీసీకి లాభాల దసరా

సూర్యాపేటలో అత్యధికం.. నార్కట్‌పల్లిలో అత్యల్పం



★ రెండు వారాల్లో రూ. 24.35 కోట్ల ఆదాయం రాక

మిర్యాలగూడ పట్టణం, నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

దసరా పర్వదినం ఆర్టీసీ సంస్థకు లాభాలు తీసుకొచ్చింది. విజయ దశమి సందర్భంగా వివిధ ప్రాంతాల ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చేందుకు ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో ఈ నెల 2 నుంచి 646 ప్రత్యేక బస్సులు నడిపారు. ఈ రెండు వారాల్లో మొత్తం 35.19 లక్షల కిలోమీటర్ల దూరం బస్సులు నడపడం ద్వారా ఆర్టీసీ సంస్థ రూ.24.35 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. సాధారణం కంటే రెట్టింపు ఆదాయం రావడంతో అధికారులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దసరా రద్దీ మరో రెండు, మూడు రోజులు కొనసాగనున్న నేపథ్యంలో ఆదాయం మరింత వచ్చే అవకాశం ఉంది.

ఆదాయం సాధించడంలో ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట డిపో ప్రథమ స్థానంలో నిలిచింది. రెండు వారాల్లో రూ.4.76కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఆ తర్వాత దేవరకొండ, మిర్యాలగూడ డిపోలున్నాయి. నార్కట్‌పల్లి డిపోకు రూ.47.42 లక్షలే వచ్చాయి.

రాష్ట్రంలోనే ప్రథమ స్థానం


రెండు వారాల్లో రీజియన్ వ్యాప్తంగా 117 ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) నమోదు కాగా.. ఈ నెల 14న అత్యధికంగా 146.12 ఓఆర్‌తో నల్గొండ రీజియన్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ రోజు రూ.2.26 కోట్ల ఆదాయం సమకూరింది. ఆ రోజు రీజియన్ లక్ష్యం రూ.146.27 కోట్లు కాగా.. రాష్ట్రంలోనే అత్యధికంగా 178 శాతం అదనపు ఆదాయాన్ని సాధించింది.

మహాలక్ష్ములే అధికం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 36.24 లక్షల మంది ప్రయాణించగా.. వీరిలో మహిళా ప్రయాణికులు 22.1 లక్షలు, డబ్బులు చెల్లించి ప్రయాణించిన వారు రూ. 14.14 లక్షల మంది ఉన్నారు. మొత్తం ఆదాయంలో మహాలక్ష్మి పథకం ద్వారా వచ్చిన రాబడి రూ.11.99 కోట్లు. డబ్బు చెల్లించి ప్రయాణించిన వారి ద్వారా రూ.12.35కోట్ల ఆదాయం వచ్చింది.

అదనపు సర్వీసులు నడిపించడంతో..

– రాజశేఖర్, ఆర్టీసీ ఆర్ఎం, నల్గొండ.



బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ముందస్తు ప్రణాళికతో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో అదనపు సర్వీసులు నడిపించాం. దీంతో రెండు వారాల్లో రూ.24కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.

అక్టోబరు 1 నుంచి 14 వరకు డిపోల వారీగా ఆదాయ వివరాలు..

డిపో	కిలోమీటర్లు	ఆదాయం (రూ.కోట్లలో)	ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో)
సూర్యాపేట	6,20,302	4.76	126
దేవరకొండ	5,97,579	4.39	122
మిర్యాలగూడ	5,98,473	4.03	109
నల్గొండ	6,54,076	3.94	103
కోదాడ	4,86,022	3.33	111
యాదగిరిగుట్ట	4,95,160	3.40	130
నార్కట్‌పల్లి	67,650	0.47	121

కారు బోల్తా.. యువకుడి దుర్మరణం

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నుంచి వరంగల్ జాతీయ రహదారిపై కారు బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్ద కందుకూరు స్టేజీ వద్ద సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామానికి చెందిన వీరమల్లు వినీత్(17) అతని నలుగురు స్నేహితులతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. మండలంలోని పెద్ద కందుకూరు స్టేజీ వద్దకు చేరుకోగానే వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి చెట్ల పొదల్లో బోల్తాపడింది. దీంతో వినీత్ అక్కడికక్కడే మృతి చెందగా మిగతావారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు తండ్రి భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కూలీ బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యం ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం చేసుకున్న ఘటన పట్టణ కేంద్రంలోని గాంధీ నగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చెక్క యాదయ్య(60) కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నారు. భార్య చెక్క హంసమ్మ స్థానిక మార్కండేశ్వర స్వామి దేవాలయంలో పని చేస్తుంది. ఉదయం హంసమ్మ పని నిమిత్తం బయటకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో యాదయ్య ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసే సరికి విగత జీవిగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బాలుడిని వెంటాడిన మృత్యువు

★ తమ్ముడిని బస్సెక్కించి వస్తుండగా ఢీకొట్టిన కారు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ఆ బాలుడిని మృత్యువు వెంటాడింది. పది రోజుల క్రితం స్వల్ప గాయాలతో బయటపడినా మంగళవారం కారు రూపంలో కబలించింది. దసరా వేడుకల్లో తోటి స్నేహితులు, బంధువుల పిల్లలతో అప్పటివరకు సరదాగా ఆడుకున్నాడు. తమ్ముడితో కలిసి ఉత్సవాలలో ఆనందంగా గడిపాడు. సెలవులు ముగియడంతో తమ్ముడ్ని పాఠశాలకు పంపే క్రమంలో ప్రమాదంలో మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాయినిగూడెం గ్రామానికి చెందిన బెక్కం అశోక్, సుష్మలకు శ్రీరాం(11), సాయిరాం కుమారులు. ఇద్దరూ హుజూర్‌నగర్‌లోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. బస్సులో వెళ్లి వస్తుంటారు. దసరా సెలవులకు ముందు రోజు హుజూర్‌నగర్ నుంచి తండ్రితో ద్విచక్రవాహనంపై వస్తున్న శ్రీరాం పుస్తకాల బ్యాగు జారిపోతుందని పట్టుకోబోయి కింద పడిపోయాడు. అప్పుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అనంతరం సెలవులు రావడంతో ఇంటి వద్దే ఉంటూ పండగ జరుపుకొన్నారు. గాయాలు పూర్తిగా తగ్గక పోవడంతో తాను బడికి వెళ్లలేక మంగళవారం ఉదయం తమ్ముడు సాయిరాంను పాఠశాలకు పంపించడానికి అమ్మమ్మ వెంకటలక్ష్మితో కలిసి స్కూల్ బస్సు దగ్గరకు వెళ్లాడు. బస్సు ఎక్కించి అందులోని తన స్నేహితులను పలకరించి వెనుతిరిగి వస్తున్నాడు. రోడ్డు దాటుతుండగా గరిడేపల్లి వైపు నుంచి హుజూర్‌నగర్ వెళ్తున్న కారు వేగంగా శ్రీరాంను ఢీకొట్టింది. దీంతో శ్రీరాం తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే హుజూర్‌నగర్‌కు అక్కడి నుంచి కోదాడకు, పరిస్థితి విషమించడంతో ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. తండ్రి అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చలిగంటి నరేష్ తెలిపారు.



శ్రీరాం

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00
రిటైల్	146–00
డ్రెస్డ్	215–00
స్కిన్‌లెస్	244–00

గింజ పోసుకునే దశలో నేలకొరిగి

○ అన్నదాతను వణికిస్తున్న వర్షాలు



గరిడేపల్లిలో ఏపుగా పెరిగి గింజ పోసుకుంటున్న వరి

గరిడేపల్లి, కోదాడ, న్యూస్‌టుడే:

ఇటీవల వరసగా వస్తున్న అల్ప పీడనాల వల్ల వస్తున్న వర్షాలు అన్నదాతకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ఏ క్షణంలో గాలి దుమారంతో వర్షం పడుతుందో, పంట నేల పాలవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏటా ఏదో ఒక ప్రాంతంలో వర్షం భారీగా నష్టం మిగుల్చుతుంది. చేతికి వచ్చిన పంట నేలకు ఒరగడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో.. పెట్టుబడి ఎలా రాబట్టుకోవాలో తెలియక దిగులు పడుతున్నారు.

భారీగా నష్టం: పొలం నేలకొరిగితే భారీగా నష్టం వాటిల్లుతుంది. గింజ పోసుకోక ముందే పడిపోతే 60-70 శాతం, గింజ పోసుకున్న తర్వాత పడితే 30 శాతం దిగుబడి తగ్గుతుంది. దీనికి తోడు వరి యంత్రాలతో కోయిస్తుండటంతో సమయం ఎక్కువగా తీసుకుంటుంది. సాధారణంగా ఎకరం గంట నుంచి గంటా పదిహేను నిమిషాలలో కోస్తే.. పడిపోయిన పొలంలో ఎకరానికి మూడు గంటలకు పైగా సమయం పడుతుంది. అంటే అదనంగా రెండు గంటల సమయం వృథా. అదనపు భారం రూ.ఆరు వేలు. 2022 వానాకాలంలో పొలాలు పడిపోయి భారీగా నష్టం వాటిల్లింది. ఎకరం మూడున్నర గంటల సమయంలో కోశారు. పంట బాగా దెబ్బతింది. ఆ ధాన్యం మిల్లుకు తరలిస్తే అనేక కొర్రీలు పెట్టి క్వింటా రూ. 1,500 నుంచి రూ. 1,800 వరకు కొనుగోలు చేశారు. పొలం పడిపోతే ఎకరానికి రూ.20 వేల నష్టం వాటిల్లుతుంది. అందుకే వానాకాలంలో అకస్మాత్తు వర్షాల తోపాటు గాలులు వీస్తే రైతులకు కన్నీరు వస్తుంది.

రెండు నెలలే కీలకం..

ఏటా వర్షాలు అక్టోబరు మొదటి వారం నుంచి చివరి వారం వరకు కురుస్తున్నాయి. జిల్లాలో ఎక్కువగా వరి పంట చేతికి వచ్చేది నవంబరులోనే. నవంబరు మొదటి వారం నుంచి డిసెంబరు 15 వరకు కోతలు పూర్తవుతాయి. అంటే అక్టోబరు మొదటి వారం నుంచి చివరి వరకు వరి ఈత దశలో కొంత, ముందుగా నాట్లు వేసినవి గింజ పోసుకునే దశలో మరికొంత ఉంటాయి. దాదాపు 80 శాతం పొలాల్లో దీపావళి వెళ్లిన వారం తర్వాత కోతలు మొదలు పెడతారు. పది శాతం మంది అక్టోబరు చివరి వారంలో ఆరంభిస్తారు. అందుకే అక్టోబరు, నవంబరు రెండు నెలల్లో గాలులు, వర్షాలు లేకుంటేనే పంట చేతికి వస్తుంది.

అంతా స్వల్పకాలిక సన్నరకాలే

ఇటీవల రైతులు స్వల్పకాలిక వరి వంగడాలనే సాగు చేస్తున్నారు. ప్రైవేటు రకాలైనా, పరిశోధనా స్థానాల నుంచి తెచ్చినవైనా 120-125 రోజుల పంట కాలం ఉండేవి, అందులోనూ సన్నరకాలు ఎక్కువగా ఉన్నాయి. వేసవిలో ఎండల తీవ్రత, వడగండ్ల వానలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగానే వానాకాలం పంట ముగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తక్కువ కాలంలో చేతికి వచ్చే పంటలు సాగు చేస్తున్నారు. ఈ రకాలు ఎత్తు ఎక్కువగా పెరుగుతున్నాయి. సాధారణంగా 90 సెం.మీ. పెరిగే వరి అంతగా పడిపోదు. కానీ ఇప్పుడు సాగు చేస్తున్న రకాలు 130 సెం.మీ. వరకు పెరుగుతున్నాయి. దుబ్బులో బలం లేకపోవడం, గట్టి పడకపోవడం, తెగుళ్లు సోకి దుబ్బు మొదలు కర్రలు బలహీనంగా ఉండటంతో గింజ పాలు పోసుకొని ధాన్యంగా మారుతున్నప్పుడు పైన బరువు ఆపలేక పడిపోతున్నాయి. నత్రజని ఎక్కువగా మొక్కకు అందడంతో ఏపుగా పెరిగాయి. ఇటీవల కురుస్తున్న గాలి వానలకు పొలాలు పడిపోతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న పొలాలు పరిశీలించి పరిహారం ఇస్తే కొంతమేరైనా అన్నదాతకు ఆసరా ఉంటుందని ఆశ పడుతున్నారు.

26 నుంచి దేవతా కల్యాణోత్సవాలు

నకిరేకల్, న్యూస్‌టుడే: ఈనెల 26 నుంచి మూడు రోజుల పాటు నకిరేకల్ సత్యసాయి మందిరంలో శ్రీనివాస భగవాన భక్త సమాజం ఆధ్వర్యంలో దేవతా కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు దేవర శెట్టి శ్రీనివాసులు, నకిరేకల్ కన్వీనర్ గర్ని శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. 26న సీతారామ కల్యాణం, 27న సువర్చలా హనుమత్కల్యాణం, 28న పార్వతీ పరమేశ్వర కల్యాణోత్సవాలు జరుగుతాయని వివరించారు. ఉత్సవాలకు పుట్టపర్తి సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు పి. వెంకట్రావ్ విచ్చేస్తున్నారని, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నల్గొండ

• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

గురుకులాలకు తక్షణమే అద్దె చెల్లించాలి

నల్గొండ విద్యావిభాగం: గురుకులాలకు తక్షణమే అద్దె చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేశ్, ఖమ్మం పాటి శంకర్ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత పదిన్నర నెలలుగా అద్దెలు చెల్లించకపోవడం వల్ల భవన యజమానులు తాళాలు వేశారని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని నాగార్జునకాలనీలో అంతర్గత మురుగు కాల్వలు పేరుకుపోయాయి. రెండు నెలలుగా శుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. – పద్మ, నల్గొండ.

✔ పరిశీలించి వెంటనే కాల్వలు శుభ్రం చేయిస్తాం. – నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నల్గొండ పురపాలిక.

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

? నల్గొండ నుంచి ఖమ్మం మీదుగా భద్రాద్రి కొత్తగూడెంకు వెళ్లే బస్సు గతంలో ఉదయం 5.15 గంటలకు బయలుదేరేది. రెండేళ్ల నుంచి ఉదయం 6.15, 7.15 నిమిషాలకు ప్రారంభం అవుతుంది. దీనివల్ల విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. –పుష్ప, రాఘవేంద్ర కాలనీ, నల్గొండ

✔ ఉదయం 5.15 బస్సులో జనం ఎక్కడం లేదు. అందువల్లే బస్సు సమయాలు మార్చాం. ప్రయాణికులు గమనించి సహకరించాలి. –శ్రీనాథ్, నల్గొండ డీఎం

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



వాల్మీకి మహర్షి విగ్రహం ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

నల్గొండ కల్చరల్, న్యూస్‌టుడే: రామాయణం సృష్టికర్త వాల్మీకి మహర్షి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో వాల్మీకి విగ్రహాన్ని పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. బొట్టుగూడలోని వాల్మీకి నగర్ నుంచి బస్టాండ్, పెద్దగడియారం చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, మిర్యాలగూడ రోడ్డుమీదుగా దేవాలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఆది ధర్మ సమాజ్ ఆదాస్ సభ్యులు రాంపాల్, పాండు, రవి, మురారి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

15 ఏళ్ల నిరీక్షణకు తెరపడేదెన్నడో!



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇటీవల మంత్రిని కలిసి వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

శాలిగౌరారం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధిలో భాగంగా ఒప్పంద పద్ధతిలో నియమించిన ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నిరీక్షిస్తున్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో సమగ్రశిక్షాభియాన్ పరిధిలో పాఠశాలలకు మండల విద్యావనరుల కేంద్రానికి అనుసంధానం చేసేందుకు పీఆర్టీలు, సమాచార, వస్తువుల సరఫరా తదితర కార్యక్రమాలకు మెసెంజర్లు, జీతాల నిర్వహణ, ఆన్‌లైన్‌లో అధికారులతో సమన్వయానికి కంప్యూటర్ ఆపరేటర్లుగా అనేక మంది పనిచేస్తున్నారు. జిల్లాలో 1163 మంది ఉండగా.. శాలిగౌరారం మండలంలోనే 30 మంది ఉన్నారు. పదిహేనేళ్ల క్రితం క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ), ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్, ఆపరేటర్లు, మెసెంజర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, జిల్లాస్థాయి అసిస్టెంట్లు, ప్రోగ్రామర్లు, కుక్ వంటి ఉద్యోగాల్లో కాంట్రాక్టు పద్ధతిన అప్పటి ప్రభుత్వం నియమించింది. వారంతా క్రమబద్ధీకరణకు ఎదురు చూస్తున్నారు.

ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని:



ములుపూరి కృష్ణ, సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు

క్షేత్రస్థాయిలో విద్యార్థుల ఉన్నతికి పనిచేసే తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. 15 ఏళ్లుగా ఇదే ఉద్యోగంలో కొనసాగుతున్నాం. మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. చాలీచాలని జీతాలతో విధులను నిర్వర్తిస్తున్నాం. గత రెండు నెలలు జీతాలు అందక నానా ఇబ్బందులు పడుతున్నాం. సమగ్రశిక్ష అభియాన్ పరిధిలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్, కనీస వేతనం అమలు చేయాలి.

మళ్లీ ఆందోళనలు చేస్తాం:



చంద్రపాక నాగరాజు, ఎస్ఎస్ఏ, జేఏసీ జిల్లా అధ్యక్షుడు, నల్గొండ

భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు వారంతా ఆందోళనలు నిర్వహించారు. ఏళ్ల తరబడి ఉద్యోగ భద్రత కల్పించాలని పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగుల దర్నాలో పాల్గొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వంపై కొండంత నమ్మకంతో ఉన్నాం. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే మళ్లీ ఉద్యమం చేపడతాం.

స్వచ్ఛంద సంస్థలకు సహకారం అందిస్తాం

నల్గొండ సంక్షేమం: జిల్లాలో పనిచేసే స్వచ్ఛంద సంస్థలకు తమ శాఖ తరపున సహకారం అందిస్తామని జిల్లా సంక్షేమాధికారిణి కృష్ణవేణి తెలిపారు. కలెక్టరేట్‌లోని సంక్షేమాధికారి కార్యాలయంలో మంగళవారం అశ్రిత స్వచ్ఛంద సంస్థ బాల్య వివాహాల నిర్మూలనపై రూపొందించిన గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు. బాల్యవివాహాల నిర్మూలన, బాలకార్మికులు, బాలల అక్రమ రవాణాతదితర అంశాలపై పనిచేస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ యం.శోభారాణి చెప్పారు. ఝాన్సీ, ధనమ్మ, కవిత, చినరాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని పీఆర్టీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కందాల చంద్రారెడ్డి హాజరై ఓటరు నమోదు ఫారాలను అందజేశారు. జడల వెంకన్న, ఎండీ.వాహిద్, కైసర్ సభిహా, బుచ్చిరెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి గ్రామీణం: అక్కెనపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బసిరెడ్డి రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఎనుగుల శ్రీనివాస్‌రెడ్డి, సామ రామచంద్రారెడ్డి, మదనయ్య, ఇద్దయ్య, ముస్తాఫా పాల్గొన్నారు.

పల్లెసుద్దులతో అవగాహన

నకిరేకల్, న్యూస్‌టుడే: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వంటి సుఖవ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నకిరేకల్ ప్రధాన కూడలిలో కళాకారులు పల్లెసుద్దుల ప్రదర్శనతో మంగళవారం అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారి నర్సింహ స్వామి, అభినవ్ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు పాల్గొన్నారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** వేట్టయన్, **వెంకటేశ్వర:** మార్టిన్, **పీవీఎన్:** మా నాన్న సూపర్ హీరో
నకిరేకల్: **రామకృష్ణ**- వేట్టయన్, **వెంకటేశ్వర**- దేవర

పాల్వాయి కుటుంబంలో భగ్గుమన్న విభేదాలు



చండూరు: ధర్నా చేస్తున్న పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి పెద్ద కుమారుడు శ్రవణ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

చండూరు, న్యూస్‌టుడే: మాజీ రాజ్యసభ సభ్యుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కుటుంబంలో ఒక్కసారిగా విభేదాలు భగ్గుమన్నాయి. గోవర్ధన్ రెడ్డి పెద్ద కుమారుడు శ్రవణ్‌రెడ్డి తన కుమార్తెని పాల్వాయి స్రవంతి కిడ్నాప్ చేశారని ఆరోపిస్తూ మంగళవారం రాత్రి నల్గొండ జిల్లా చండూరులోని చౌరస్తాలో గ్రామస్థులతో కలిసి రోడ్డుపై ధర్నా చేపట్టారు. సెప్టెంబరు 11న అర్ధరాత్రి తమ పాప కనిపించకుండా పోయిందని శ్రవణ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల తర్వాత పోలీసులు నల్గొండలోని బాలల సంరక్షణ కేంద్రంలో పాపకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. మరల తిరిగి మంగళవారం రెండో కౌన్సిలింగ్ ఉందని చెప్పి పాపను పోలీసులు నల్గొండ సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం పాప పాల్వాయి స్రవంతితో కలిసి వెళ్లిందని ఆరోపిస్తూ.. మా కూతురుని మాతో పంపించి న్యాయం చేయాలని ఆయన రోడ్డుపై ధర్నా చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని తెలపగా ధర్నా విరమించారు.

'ఎన్నికల హామీల అమలులో అలసత్వం'

చిట్యాల, న్యూస్‌టుడే: ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం అలసత్వంతో వ్యవహరిస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్ విమర్శించారు. చిట్యాల పురపరిధి పెద్దబావిగూడెంలో మంగళవారం నిర్వహించిన తమ పార్టీ మహాసభకు హాజరయ్యారు. పేదలకు ఇళ్లస్థలాలతోపాటు నిర్మాణంలో ఉన్న రెండు పడకగదుల ఇళ్ల పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి పంపిణీచేయాలన్నారు. పురపాలికలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అక్కెనపల్లి నాగయ్య, జిల్లాకమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, నాయకులు గోదుమగడ్డ వెంకట్ రెడ్డి, జిట్ట స్వామి, సుక్క లక్ష్మమ్మ, పాల బాలనర్సమ్మ, బొల్లూరి రాధిక, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జయంతి

నకిరేకల్, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి, భారత రత్న డా.ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి కార్యక్రమాన్ని నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి ప్రిన్సిపల్ డా.బెల్లి యాదయ్య పూలమాలలతో నివాళులు అర్పించారు. లక్ష్యసాధనకు పేదరికం అడ్డుకాదని, దీనికి కలాం జీవితమే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సహాయ ఆచార్యుడు శ్రీనివాసచారి, అధ్యాపకులు నాగు, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిత, శంకర్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని మండలంలోని దామెర బీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లచ్చిరాం, మంజులత, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా గొలుసు దుకాణాలు నిషేధించండి



నాంపల్లి : మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి

నాంపల్లి, న్యూస్‌టుడే: మునుగోడు నియోజకవర్గంలో మద్యం గొలుసు దుకాణాల కట్టడికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రిని ఒప్పించి రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేయించాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో కార్యకర్తలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గంలోని పల్లెల్లో గొలుసు దుకాణాల పేరుతో చిరు వ్యాపారులపై పోలీసులు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాంపల్లి మండలంలో పోలీసులు అర్ధరాత్రి ఇళ్లల్లోకి వెళ్లి మద్యం అమ్ముతున్నారంటూ మహిళలు, దివ్యాంగులను దుర్భాషలాడుతూ, చరవాణులు తీసుకెళ్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మద్య నిషేధం అమలు చేస్తే తాము మద్దతిస్తామని తెలిపారు. భాజపా మండల అధ్యక్షుడు దాచెపల్లి నర్సింహ, సీహెచ్.గిరిబాబు, సతీశ్, వెంకటయ్య, కాంతారెడ్డి, పి.ఈశ్వర్, కె.శ్రీనివాస్, చందర్‌నాయక్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి యువతికి ఫోర్బ్స్ ఇండియా డిజిటల్ స్టార్స్‌లో 86 స్థానం



కొమిరెల్లి ఆకాంక్ష

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఎం.యడవెల్లికి చెందిన కొమిరెల్లి ఆకాంక్షి ఫోర్బ్స్ ఇండియా డిజిటల్ స్టార్స్ టాప్ 100లో 86వ స్థానం సాధించారు. ఈమె యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో మూడు లక్షల కంటే ఎక్కువ మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉన్నారు. మేకప్, ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ కంటెండ్ క్రియేటర్. ఈమె కొమిరెల్లి అనంతరెడ్డి, మమత దంపతుల మూడో కుమార్తె. వీరి కుటుంబ సభ్యులంతా గత 25 ఏళ్లుగా హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. 2019లో తనకు ఇష్టమైన మేకప్ రంగంలో వీడియోలు పోస్ట్ చేయడం ప్రారంభించారు. గతంలో స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే వంటి వారికి మేకప్ వేశానని, అమెజాన్, మైత్రి, నైకా, లోరిల్ వంటి ప్రముఖ బ్రాండ్‌లతో కలిసి పని చేశానని ఆమె తెలిపారు. ఇటీవల ముంబైలో ఒక ప్రముఖ ప్రాంతంలో గార్నియల్ బ్రాండ్ కోసం బిల్‌బోర్డ్‌లో కనిపించానని, ఫోర్బ్ ఇండియాలో అండర్ 30లో స్థానం సాధించడం తన లక్ష్యమని పేర్కొన్నారు.

ఇందిరమ్మ కమిటీలను వెంటనే పూర్తి చేయాలి



మునుగోడు క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు, న్యూస్‌టుడే: ఇందిరమ్మ కమిటీలను వెంటనే పూర్తి చేయాలని డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల స్థాయి నాయకులతో సమావేశం అయి మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీమనపల్లి సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎంపీపీ పోలగోని సత్యం, సీనియర్ నాయకులు నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకన్నయాదవ్, అంజయ్య, మిర్యాల వెంకన్న పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లెబోయిన నర్సింహ(43) గ్రామంలో వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల కాలంలో ఆయన భార్య కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ మద్యానికి బానిసయ్యారు. దీంతో సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డారు. తల్లి బుచ్చమ్మ రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ఉరివేసుకుని చనిపోయి ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తల్లి బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్.ధర్మా తెలిపారు.

పురుగు మందు తాగి యువకుడి..



యసరాని శివ

మునుగోడు, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మునుగోడు మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యసరాని వీరయ్య, లక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలరు. వీరు ఇంటి నిర్మాణానికి కొంత వరకు అప్పు చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు చూసి మనోవేదనకు గురైన పెద్ద కుమారుడు శివ (24) ఇంట్లో ఎవరూ లేని సమయంలో శీతల పానియంలో పురుగు మందు కలిపి తాగారు. తమ్ముడు సాయి అన్నకు ఎన్నిమార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో ఇంటికి వచ్చారు. తలుపులు మూసి ఉండటం గమనించి.. వాటిని పగులగొట్టి వెళ్లి చూడగా శివ విగతజీవిగా కనిపించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడి మృతి

కేతేపల్లి, న్యూస్‌టుడే: కేతేపల్లికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ముదిరెడ్డి వీరారెడ్డి (78) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. రెండు రోజుల క్రితం ఆరోగ్యపరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్చారు. మంగళవారం సాయంత్రం గుండెపోటు రావడంతో ఆయన మృతిచెందారు. వీరారెడ్డి మృతిపట్ల మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు పలువురు సంతాపం ప్రకటించారు.

లారీ ఢీకొని పాదచారి దుర్మరణం

హయత్‌నగర్, న్యూస్‌టుడే: వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొనడంతో ఒకరు దుర్మరణం పాలైన ఘటన హయత్‌నగర్ పోలీసు ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నల్గొండ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన ఇమ్మడి సత్యనారాయణ(50), భార్య మంజుల, కుమార్తె నిత్యతో కలిసి పెద్దఅంబర్‌పేట ఏ-1 బేకరీ వెనక అద్దె ఇంట్లో ఉంటున్నారు. స్థానికంగా ఓ ఆటో మొబైల్ షాపులో గుమాస్తాగా పని చేస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నారు. మంగళవారం ఉదయం రోజువారీగా దుకాణానికి కాలినడకన వెళ్తుండగా, విజయవాడ దిశగా వెళుతున్న లారీ ఢీకొట్టడంతో వాహనం చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడల కోటాలో అనర్హుల ఎంపికపై ఫిర్యాదు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ 2024 ఎస్‌జీటీ పోస్టుల ఎంపికలో 1:3 కింద క్రీడా కోటాలో పిలిచి సర్టిఫికెట్‌లు పరిశీలించిన అధికారులు తీరా ఎంపిక చేసిన జాబితాలో ఆ కోటాలో లేని వారిని ఎంపిక చేసి క్రీడాకారులకు అన్యాయం చేశారని డీఎస్సీ 2024 ఎస్‌జీటీ స్పోర్ట్సు అభ్యర్థులు అదనపు కలెక్టర్‌కు టి.పూర్ణచంద్రకు ఫిర్యాదు చేశారు. అక్రమంగా నింపిన వారి నియామక ఆర్డర్లు రద్దు చేసి క్రీడాకారులకు పోస్టింగ్ ఇచ్చి న్యాయం చేయాలని శ్రీనివాస్, విజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రమేష్‌లు కోరారు.

కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవాలు



చిట్యాల: కరపత్రాలు విడుదలచేస్తున్న పామనగుల్ల అచ్చాలు తదితరులు

చిట్యాల, న్యూస్‌టుడే: కల్లుగీతకార్మిక సంఘంవ 67వ వార్షికోత్సవాలు ఈనెల 18న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించనున్నామని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామనగుల్ల అచ్చాలు పేర్కొన్నారు. ఈ మేరకు వార్షికోత్సవాల ప్రచార కరపత్రాలను చిట్యాలలో మంగళవారం ఆయన తమ సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. దివంగత నేతలు బొమ్మగోని ధర్మభిక్షం, నర్రా రాఘవరెడ్డి, బైరు మల్లయ్య, తొట్ల మల్సూర్ వంటి నాయకులు కల్లుగీత కార్మికుల పక్షాన అనేక ఉద్యమాలు నిర్వహించారని పేర్కొన్నారు. ఫలితంగా 1957 సంవత్సరంలో కల్లుగీత కార్మిక సంఘం ఏర్పాటయ్యిందన్నారు. వార్షికోత్సవాలను గీత కార్మికులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మామిడి హనుమంతు, గునగంటి కృష్ణయ్య, మాదగోని దేవయ్య, ఉడుగు సత్తయ్య, నకిరేకంటి రాములు, గురిజ భిక్షం, కట్టగూరు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చండూరు: ఈనెల 18న బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేజీకేఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గీత కార్మిక సదస్సుకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న పిలుపునిచ్చారు. సంబంధిత గోడపత్రికను మంగళవారం చండూరు మండల కేంద్రంలో ఆవిష్కరించారు. గీత కార్మికులు సహజ మరణం పొందితే రూ. 10 లక్షల ప్రమాద బీమా కల్పించాలన్నారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ధనుంజయ్, రవీందర్, కిరణ్, కిరణ్, యాదయ్య, కృష్ణయ్య, వెంకన్న పాల్గొన్నారు.

వ్యాల్యూ ఆఫ్ గోల్డ్ మొబైల్ ఏర్పాటు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో మొదటి సారి బంగారం కొనుగోలు చేసేందుకు మొబైల్ గోల్డ్ వాహనం ఏర్పాటు చేసినట్లు వాల్యూ గోల్డ్ అధినేత అభిషేక్ చందా తెలిపారు. నల్గొండలో మంగళవారం ఆయన మాట్లాడుతూ 1901 నుంచి బులియన్ వ్యాపారంలో ఉన్న వ్యాల్యూ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, క్యాప్స్ గోల్డ్ రిటైల్ జ్యూవెలరీ, గోల్డ్ రీఫైనరీ, జ్యూవెలరీ తయారీ సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వ్యాల్యూ గోల్డ్ వాహనం అక్టోబరు 14 నుంచి 18 వరకు నల్గొండలోని ఎస్ఆర్‌గార్డెన్, 19 నుంచి 23 వరకు మిర్యాలగూడలోని సమ్మిరెడ్డి వీరారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. తాకట్టులో ఉన్న బంగారం విడిపించి కొనుగోలు చేస్తారన్నారు. అవసరాల కోసం బంగారం అమ్మాలనుకునే వారికి సంస్థ అన్నిరకాల వెసులుబాటు కల్పిస్తుందన్నారు. 2023 సెప్టెంబరులో ప్రారంభమైన సంస్థ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, కూకట్‌పల్లి, ఉప్పల్, సికింద్రాబాద్, చింతల్ ప్రాంతాల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నారని వివరించారు.

ఎస్సైని దూషించిన యువకులపై కేసు

మట్టెవాడ(వరంగల్), న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్సైని దూషించిన యువకులపై ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. మట్టెవాడ సీఐ షుకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా ట్రాఫిక్ ఎస్సై యాదగిరి విధుల్లో భాగంగా సోమవారం రాత్రి తపాలా ప్రధాన కార్యాలయం కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో నల్గొండ జిల్లాకు చెందిన కోడె శ్రీకాంత్, ఊడే దినేష్ మద్యంతాగి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. సదరు యువకులను ఆపి వివరాలు అడుగుతున్న క్రమంలో మద్యంమత్తులో విధులకు ఆటంకం కలిగిస్తూ.. వ్యక్తిగత దూషణకు పాల్పడ్డారు. ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు యువకులను ఠాణాకు తీసుకెళ్లారు. ఎస్సై యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఇతర రాష్ట్రాల ధాన్యాన్ని అనుమతించొద్దు



నల్గొండ సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అధికారులు.

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వానా కాలంలో జిల్లాలో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానుందని అంచన వేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ తెలిపారు. నల్గొండ సమీపంలోని మర్రిగూడ బైపాస్ రోడ్డు పరిధిలో హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇందుకు జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, రైతులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని తీసుకురాకుండా నియంత్రించడంలో భాగంగా వాడపల్లి, సాగర్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని వివరించారు. రైతులు ధాన్యం అమ్మిన డబ్బులు వెంటనే పొందేందుకు కొనుగోలు కేంద్రం వద్దనే పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపి తీసుకురావాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణమే టోల్ ఫ్రీ నెంబర్ **9963407064**కు ఫోన్ చేయాలని కోరారు. డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీసీవో పత్యానాయక్, పౌరసరఫరాల సంస్థ డీఎం హరీశ్, హాకా డీఎం కోటయ్య, ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్లెంల సైదులు అన్నారు. చెర్వుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఇన్‌ఛార్జి హరికృష్ణ, ఎరుకల వెంకన్న, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తి: రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరను అందిస్తోందని, ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలని డీపీఎం రామలింగయ్య, ఏపీఎం శ్రీదేవి అన్నారు. మామిడాల, పజ్జూరు, ఎర్రగడ్డలగూడ, తానేదార్‌పల్లి, అంతయ్యగూడ, రామలింగాలగూడ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు వెల్లంల సునీత, సీసీలు ఎమేలియా, జానకమ్మ, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

కనగల్: రైతు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర అందజేస్తుందని, దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని డీఆర్‌డీవో వై.శేఖర్‌రెడ్డి సూచించారు. పర్వతగిరి, కనగల్-1, కనగల్-2(సన్నధాన్యం కేంద్రం), బుడమర్లపల్లి, జి.యడవల్లి, కురంపల్లి, శాబుద్దాలపురం, పగిడిమర్రి, దొరెపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా కొనుగోలు చేయాలన్నారు. తహసీల్దార్ పద్మ, ఎంపీవో సుమలత, ఏపీఎం సంకు హరి, ఏపీవో సుధాకర్, సీసీలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే



కొర్లపహాడ్‌లో ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, ప్రజాప్రతినిధులు

కేతేపల్లి: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం చెప్పారు. కొర్లపహాడ్, కొత్తపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే వీరేశం మాట్లాడారు. గ్రేడ్‌ల వారీగా ధాన్యానికి మద్దతు ధర, బోనస్ ఇస్తూ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకపోకుండా అధికారయంత్రాంగం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ జె.హరీశ్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో పురుషోత్తం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ప్రజా సంఘాల సదస్సు

నీలగిరి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాల నియామకం చేపట్టవద్దని ప్రత్యాన్ని హెచ్చరించడం కోసం బుధవారం నిజామాబాద్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ప్రజా సంఘాల సదస్సు విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ కోరారు. ప్రభుత్వ చర్యలను ఉద్యమాల ద్వారా అడ్డుకోవడం కోసం మందకృష్ణమాదిగ మార్గదర్శనంలో ఉద్యమించడానికి ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు, యువకులు మహిళలు విద్యార్థులు అదిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

ఉచిత కంటి పరీక్షలు

నల్గొండ కలెక్టరేట్: తెలంగాణ ఆల్‌పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సౌజన్యంతో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు బుధవారం యూటీఎఫ్ భవన్‌లో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ తెలిపారు. మ్యాక్సివిజన్ శ్రీ మహాలక్ష్మీ కంటి ఆసుపత్రి వనస్థలిపురం హైదరాబాద్ వారిచే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. కంటి పరీక్షలతో పాటు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అవీ ఇవీ

ఆర్థికసాయం అందజేత.. శాలిగౌరారం: మండలంలోని తుడిమిడికి చెందిన బండారు సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. అతడితో 2001లో పదోతరగతి చదివిన పూర్వ స్నేహితులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేల ఆర్థికసాయాన్ని అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పొన్నాల కోటేశ్వర్, గిరగాని సురేష్, చౌగాని జానయ్య, రవి, వీరభద్రయ్య, నర్సింహస్వామి, సైదులు, చౌగాని అశోక్, పరశురాములు పాల్గొన్నారు

మర్రిగూడ: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొండూరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ జర్పుల బిచ్యానాయక్ కుటుంబాన్ని కొడాల అల్వాల్‌రెడ్డి పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కృష్ణ, సైదులు, ప్రదీప్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థికి చేయూత.. నల్గొండ గ్రామీణం: మండలంలోని నర్సింగ్‌బట్లకు చెందిన ఎన్నమల్ల శాలినికి నీట్‌లో 479 ర్యాంకు సాధించింది. ఎంబీబీఎస్ నాగర్‌కర్నూల్ ఫ్లేస్మెంట్ సీటు వచ్చింది. గ్రామ అభివృద్ధి సొసైటీ సభ్యులు స్పందించారు. విద్యార్థికి రూ. 41 వేలు ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో చదువుకు కావాల్సిన సహాయం అందిస్తామని సత్యనారాయణ, కోటిలింగం, శ్యాంసుందర్ తదితరులు తెలిపారు.

నియామకం.. చిట్యాల: మాలమహానాడు మండలాధ్యక్షుడుగా చిట్యాలకు చెందిన గోలి భాస్కర్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి నియామక ఆదేశాలు జారీచేశారు. రెండేళ్లపాటు భాస్కర్ ఈ పదవిలో కొనసాగనున్నారు.

బాధ్యతల స్వీకరణ.. చిట్యాల: టీజీఎస్‌పీడీసీఎల్ చిట్యాల సెక్షన్ పట్టణ లైన్‌మెన్‌గా ఈశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు ఏఈ రవీందర్‌రెడ్డితోపాటు సహచర సిబ్బంది ఆయనను అభినందించారు.

మిర్యాలగూడ
• మిర్యాలగూడ • నాగార్జునసాగర్ • దేవరకొండ

దేవరకొండ డిపోలో సంబరాలు

దేవరకొండ, న్యూస్‌టుడే: దసరా పురస్కరించుకొని తిరుగు ప్రయాణంలో నడిపిన బస్సుల ద్వారా ఈనెల 14న ఒక్కరోజే దేవరకొండ డిపో రూ.47.83 లక్షలు ఆర్జించి ఓఆర్‌లో 162.42తో రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించిందని డిపో మేనేజర్ తల్లాడ రమేష్ తెలిపారు. మంగళవారం దేవరకొండ ఆర్టీసీ డిపోలో సిబ్బందితో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. దేవరకొండ ఆర్టీసీ బస్ సర్వీసులు ఈనెల 14న 45,533 కిలోమీటర్లు తిరిగి 54,968 మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరవేశాయన్నారు. వీరిలో 35695 మంది మహిళా ప్రయాణికులని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

నేడు సీసీఐ పత్తి కొనుగోలు ప్రారంభం

చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని శివసాయి కాటన్ జిన్నింగ్ మిల్లులో బుధవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించనున్నట్లు మాల్ మార్కెట్ కమిటీ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పండించిన పత్తిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.



అధ్యాపకుల నిరసన

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: మూడేళ్లుగా ప్రభుత్వం డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడానికి నిరసనగా మంగళవారం మండల కేంద్రంలో గల శ్రీక్రాంతి డిగ్రీ కళాశాల అధ్యాపకులు తరగతులను బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే ప్రమాదముందని వారు వాపోయారు. ప్రిన్సిపల్ ఆంజనేయులు, యర్రమాద గోవర్ధన్‌రెడ్డి, దీపక్, అర్జున్, చిన్న, శివ, శాంతిరాజ్, నాగయ్య, నరేంద్రచారి పాల్గొన్నారు.

అడుగడుగునా గండమే..!



త్రిపురారం మండలం కంపాలపల్లి చెరువు కట్ట నుంచి పూసలపాడు వెళ్లే దారి దుస్థితి

త్రిపురారం, న్యూస్‌టుడే: మండంలోని కంపాలపల్లి చెరువు కట్ట దిగిన దగ్గరి నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న పూసలపాడుకు వెళ్లే దారి అధ్వానంగా తయారైంది. అడుగుకో గుంత ఉండడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. కంపాలపల్లి చెరువు అలుగు పోస్తే వరద నీరంతా దారి మీదుగానే ప్రవహిస్తుంది. ఈ మార్గం గుండానే కంపాలపల్లి రైతులు పొలాలకు, పెద్దదేవులపల్లిలోని రసాయనిక పరిశ్రమకు, మాడ్గులపల్లి మండలంలోని విశాఖ పరిశ్రమకు నిత్యం కంపాలపల్లి, కామారెడ్డిగూడెం, మునగబావిగూడెం గ్రామాలకు చెందిన కార్మికులు పరిశ్రమల్లో పని చేయడానికి వెళ్తుంటారు. భారీ వర్షాలు పడితే వారు విధులకు వెళ్లడం మానేస్తారు. మట్టి రోడ్డు అయినా వేయాలని స్థానికులు కోరుతున్నారు. పూసలపాడు గ్రామ సమీపంలో ఉన్న వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తే కల్వర్టు పైనుంచి వరద ప్రవహించి రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. ఈ విషయమై పీఆర్ ఏఈ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కంపాలపల్లి చెరువు దగ్గరి నుంచి పూసలపాడు వరకు ఉన్న డు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు వేయడానికి రూ.ఐదు లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

16న నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

హాలియా, న్యూస్‌టుడే: హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఈ నెల 16న ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఛైర్మన్‌గా పెద్దవూర మండలం చలకూర్తికి చెందిన కాంగ్రెస్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా తిరుమలగిరిసాగర్ మండలం బోయగూడెం గ్రామానికి చెందిన కలసాని చంద్రశేఖర్ నియమిస్తూ ప్రభుత్వం ఇదివరకే ఉత్తర్వులు జారీ చేసింది. హాలియాలో నిర్వహించనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి హాజరుకానున్నారు.

టీకాల పంపిణీ

మిర్యాలగూడ గ్రామీణం: మండల పరిధిలోని తుంగపాడు, తడకమళ్ల, నందిపాడు గ్రామాల్లో మంగళవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించి 450 పశువులకు గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేసినట్లు మండల వైద్యాధికారిణి డాక్టరు దుర్గారమాదేవి తెలిపారు. ఏడీ డాక్టరు శంకర్‌రావు శిబిరాలను పరిశీలించినట్లు చెప్పారు.



సద్వినియోగం చేసుకోవాలి

చందంపేట: స్వల్ప, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ దేవరకొండ వారి ఆధ్వర్యంలో బుధవారం తెల్‌దేవరపల్లిలో నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం పీఏసీఎస్ ఛైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు.

అనారోగ్యంతో విద్యార్థి బలవన్మరణం

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: గొంతునొప్పిని భరించలేక ఓ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సోమవారం సాయంత్రం బలవన్మరణానికి పాల్పడగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక సాగర్‌రోడ్డులో నివాసముంటున్న విద్యార్థి (17) పట్టణంలో గల ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నాడు. నాలుగేళ్లుగా గొంతునొప్పితో బాధపడుతున్నాడు. పలుసార్లు వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో మానసిక ఒత్తిడికి లోనై ఇంట్లోనే ఉరేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. శవపరీక్ష నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించామని, తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై జగన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో స్టాఫ్ నర్సుకు గాయాలు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గుర్రంపోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న సిలివేరు అనసూర్య ఈనెల 14న సాయంత్రం గుర్రంపోడు నుంచి కొండమల్లేపల్లిలోని తన ఇంటికి వెళ్తుండగా గుడిపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం బలంగా ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన అనసూర్యను మొదట దేవరకొండకు, అక్కడి నుంచి హైదరాబాద్ ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమె బావ బొడ్డు జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

యువకుడి అదృశ్యం

గుర్రంపోడు, న్యూస్‌టుడే: పెళ్లిసంబంధం కుదిరి పెళ్లి వస్త్రాల కొనుగోళ్లకు తల్లితో కలిసి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన గుర్రంపోడు మండలంలో జరిగింది. మక్కపల్లి గ్రామపంచాయతీ వీటీనగర్‌కు చెందిన నేతాళ్ల వెంకటమ్మ కుమారుడు సతీష్‌కు ఇటీవల పెళ్లి కుదిరింది. ఈనెల 5న ఎంగేజ్‌మెంట్ జరిగింది. ఈ నేపథ్యంలో ఈ నెల 14న కొండమల్లేపల్లికి పెళ్లి వస్త్రాల కొనుగోలుకు తల్లి వెంకటమ్మతో కలిసి వెళ్లాడు. దుకాణంలో వస్త్రాలు కొనుగోలు చేస్తుండగా ఇప్పుడే వస్తానంటూ వెళ్లిన సతీష్ తిరిగి రాలేదు. మంగళవారం తల్లి వెంకటమ్మ గుర్రంపోడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

అమ్రాబాద్: ద్విచక్ర వాహనంపై శ్రీశైలం బయలుదేరిన దేవరకొండ మండలం శేరిపల్లికి చెందిన మాడెం ఈదయ్య మార్గమధ్యలో అదృశ్యమయ్యారు. క్షేత్ర పర్యటనకు వెళ్లిన మన్ననూరు ఎఫ్‌బీవో మధుసూధన్‌కు మన్ననూరు నుంచి 5కి.మీ. దూరంలో శ్రీశైలం ప్రధాన రహదారి పక్కన ద్విచక్ర వాహనం, శిరస్త్రాణం, చరవాణి కనిపించాయి. వీటి ఆధారంగా ఈదయ్య కుటుంబ సభ్యులకు సమాచారమందించామని ఎస్సై ఖాద్రి తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గొర్రెలను మేపుతూ రోడ్డుపై వెళ్తున్న కాపరిని కొట్టిన ద్విచక్రవాహనదారులపై గుర్రంపోడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 13న పోచంపల్లికి చెందిన ఈరటి సాలయ్య రోడ్డుపై గొర్రెలను తోలుకుపోతుండగా మూడు ద్విచక్రవాహనాలపై వెళ్తున్న గట్టుప్పల్, చండూరు మండలాలకు చెందిన బీమనపల్లి శివ, ఉంగరాల ఈశ్వర్, రాకేష్, సాయన్న మరో ఇద్దరు యువకులు కలిసి ఈరటి సాలయ్యపై దాడి చేశారు. మంగళవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్తు డీఈ బాధ్యతల స్వీకరణ

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడ డివిజన్ విద్యుత్తు డీఈగా టీఎస్ సుధీర్‌కుమార్ మంగళవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా దేవరకొండ డీఈ శ్రీనివాస్ విధులు నిర్వర్తిస్తుండగా.. ఆయన స్థానంలో నల్గొండ కన్‌స్ట్రక్షన్ డీఈ సుధీర్‌కుమార్‌ను మిర్యాలగూడ డీఈగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఉద్యోగ సంఘాల నాయకులు, సిబ్బంది స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.



మిర్యాలగూడలో విద్యుత్తు డీఈ సుధీర్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు



అబ్దుల్‌కలాం అడుగుజాడల్లో నడవాలి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: పేదరికంలో జన్మించినప్పటికీ చదువు ప్రాధాన్యం తెలుసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించడంతో పాటు తుది శ్వాస వరకు దేశ సేవలోనే తరించిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం అడుగుజాడల్లో నేటి యువత నడవాలని పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని స్థానిక పుర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ పుర అధ్యక్షురాలు తిరునగరు నాగలక్ష్మి, భాజపా ఫ్లోర్ లీడర్ చిలుకూరి రమాదేవి, అమృతం దుర్గ, సత్యం, సంజాతచ సత్యవేణి, స్వర్ణ, స్రవంతి, నవాబ్, మలగం రమేష్, వజ్రం, శ్రీనివాస్, చిలుకూరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ్, తదితరులు


వీరన్నగుట్టలో తవ్వకాలు.. తండావాసుల ఆందోళన

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని చింతచెట్టుతండా గ్రామపంచాయతీ శివారు జేత్యతండాలో గుప్త నిధుల కోసం భారీగా తవ్వకాలు జరిపిన ఉదంతం మంగళవారం వెలుగులోకి వచ్చింది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. జేత్యతండా పరిధిలో గల సర్వే నెంబర్ 19లో సుమారు 110 ఎకరాల పట్టా భూములున్నాయి. ఐదేళ్ల క్రితం ఓ స్థిరాస్తి వ్యాపారి 15 ఎకరాలను తండాకు చెందిన ముగ్గురు వ్యక్తుల నుంచి కొనుగోలు చేశారు. అందులో వీరన్నగుట్టలో బండలపై వెలిసిన వీరన్న, మల్లన్న, ఆంజనేయస్వామి విగ్రహాలున్నాయి. చుట్టుపక్కల గల చింతచెట్టుతండా, జేత్యతండా, పుల్‌సింగ్‌తండాలకు చెందిన గిరిజనులు సుమారు 40 ఏళ్లుగా పండగలు, తమ ఇళ్లల్లో జరిగే శుభకార్యాలకు అక్కడికి వచ్చి పూజలు చేసేవారు. స్థిరాస్తి వ్యాపారి గుట్ట చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి తండావాసులు అక్కడికి రాకుండా చేశారు. రెండు నెలలుగా పెద్ద పెద్ద పొక్లెయిన్లతో రాత్రివేళలో గుట్టను తొవ్వి సుమారు 30 అడుగుల వెడల్పు, 50 అడుగుల లోతు మేర గుంత తవ్వారు.



రాళ్ల మధ్య ఉన్న విగ్రహాలను చూపుతున్న తండావాసులు

వెలుగులోకి వచ్చిందిలా... తండావాసులు మంగళవారం పెద్ద పెద్ద గుంతలు చూసి ఎందుకు తవ్వారని స్థిరాస్తి వ్యాపారిని ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారంటూ మూకుమ్మడిగా నిలదీశారు. దీంతో గుడిని కట్టిస్తానని ఆయన హామీ ఇచ్చారు. తండావాసుల ఫిర్యాదు మేరకు గుంతలు తవ్విన ప్రదేశాన్ని పరిశీలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్సై అజ్మీర రమేశ్ తెలిపారు.



ధరల అదుపులో కేంద్రం విఫలం: జూలకంటి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నిత్యావసర ధరలను అదుపు చేయడంలో కేంద్రం దారుణంగా విఫలమైందని.. ఓ పక్క ధరల పెరుగుదల, మరో పక్క పన్నుల భారంతో ప్రజలు కుదేలైపోతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఈనెల 17 నుంచి సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మల్లేష్, వెంకటేశ్వర్లు, జగదీశ్చంద్ర, రవినాయక్, గౌతం రెడ్డి, పాండు, వినోద్‌నాయక్, శశిధర్‌రెడ్డి, మంగారెడ్డి, వరలక్ష్మి, అయూబ్ పాల్గొన్నారు.

భాజపాతోనే అభివృద్ధి సాధ్యం

దేవరకొండ, న్యూస్‌టుడే: దేశ అభివృద్ధి భాజపాతోనే సాధ్యమని ఆ పార్టీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నేతాళ్ల వెంకటేష్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలో ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. భాజపా పట్టణ ప్రధాన కార్యదర్శి జెల్ల భాస్కర్ తదతరులున్నారు.

చింతపల్లి: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్ తెలిపారు. జిల్లా సభ్యత్వ ఇన్‌ఛార్జి తుళ్ల వీరేందర్‌గౌడ్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

వేములపల్లి: మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామంలో మంగళవారం భాజపా ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు మాట్లాడారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ సైదులు, భరత్, ప్రసాద్, నరేష్, మహేష్, పాల్గొన్నారు.

అవీ ఇవీ

ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటుకు కసరత్తు... మిర్యాలగూడ పట్టణం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మిర్యాలగూడ పట్టణంలోని 48 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ్ తెలిపారు. కమిటీల ఏర్పాటుపై మంగళవారం పుర కార్యాలయంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో మాట్లాడారు. పుర కమిషనర్ ఎండీ యూసుఫ్, మాజీ పుర అధ్యక్షురాలు నాగలక్ష్మి, భారాస, భాజపా ఫ్లోర్ లీడర్లు ఇలియాస్, రమాదేవి, కౌన్సిలర్లు, పుర, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

పరామర్శ... చింతపల్లి: మండలంలోని తీదేడు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సందె ఏసు తల్లి మృతి చెందటంతో మంగళవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సైదులు పరామర్శించారు. వెంకటయ్య, సహదేవుడు, కాశయ్య, యేసయ్య, సతీష్, నగేష్ ఉన్నారు.

ఓటు నమోదు చేసుకోండి.. మిర్యాలగూడ గ్రామీణం: ఉన్నత విద్యాసంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులు అందరూ శాసనమండలి ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యడవల్లి దామోదర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జప్తీవీరప్పగూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ శాసనమండలి ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, రమేష్ శిరీష పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి.. త్రిపురారం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు కత్తి లింగారెడ్డి అన్నారు. మంగళవారం మండంలోని కంపసాగర్‌లో కొప్పు వెంకన్న అధ్యక్షతన 18వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. శ్రీను, రాంచంద్రయ్య, వెంకన్న, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పుట్టినరోజు వేడుకల నిర్వాహకులపై కేసు నమోదు

మిర్యాలగూడ పట్టణం: మిర్యాలగూడలోని రాజీవ్‌చౌక్ వద్ద ఈ నెల 14న సాయంత్రం రోడ్డుపై పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడంతో పాటు డీజేతో ప్రజలకు అసౌకర్యం కలిగించిన ఘటనలో కాంగ్రెస్ నాయకుడు చిలుకూరి బాలకృష్ణతో పాటు డీజే యజమాని, వేడుకల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ సీఐ నాగార్జున తెలిపారు. డీజే వాహనాన్ని సోమవారం రాత్రే సీజ్ చేసినట్లు తెలిపారు.

మూడు చెరువులు రూ.30,200.. మిర్యాలగూడ గ్రామీణం: మండల పరిధిలోని జప్తీవీరప్పగూడెంలోని రేకులకుంట, రామచెరువు, వాయలకుంట(కట్లకుంట)లలో చేపలను పెంచుకునేందుకు మత్స్యశాఖ, గ్రామపంచాయతీ కార్యదర్శి రమణ మంగళవారం వేలంపాట నిర్వహించారు. మూడు చెరువులకు కలిపి మొత్తం రూ.30,200లకు వేలం పాట దక్కించుకున్నట్లు తెలిపారు.

నేడు చలో నిజామాబాద్... చింతపల్లి: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో నిజామాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం మండల ఉపాధ్యక్షుడు యాదగిరి కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ.. మిర్యాలగూడ పట్టణం: హైదరాబాద్‌లో ఈ నెల 18న జరుగనున్న కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవాల కరపత్రాలను మంగళవారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాములు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడారు. వెంకన్న, నాగయ్య, సోమయ్య, శ్రీనివాస్, అంతయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం... దేవరకొండ: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు అన్నారు. మంగళవారం దేవరకొండలో బీఆర్‌ఎస్వీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల భవనాలకు అద్దె చెల్లించడం లేదని.. కళాశాల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని విమర్శించారు. కృష్ణ, ప్రవీణ్, ప్రవీణ్, గమీర్, వెంకటేష్, కొండల్ తదితరులున్నారు.

★ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి.. నాగార్జునసాగర్: తెలంగాణ సాధన పోరాటంలో పాల్గొన్న ఉద్యమకారులందరిని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాయితీ జానకిరెడ్డి కోరారు. మంగళవారం సాగర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. వెంకన్న, మధు, రవి, రామకృష్ణ, పాల్గొన్నారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** విశ్వం, **శ్రీనివాస:** వేట్టయన్
విట్రోస్: దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక, మార్టిన్

